వీడని జల దిగ్బంధం


యలమంచిలి మండలం దొడ్డిపట్ల మత్స్యకార కాలనీలో వరద

నీట మునిగిన రహదారులు

యలమంచిలి: గోదావరి ఎగువ నుంచి వరద నీరు పోటెత్తడంతో వరుసగా ఏడో రోజూ లంక గ్రామాలు వరద నీటితో జల దిగ్బంధమయ్యాయి. ధవళేశ్వరం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక ప్రకటించిన రోజు నుంచి యలమంచిలి, ఆచంట మండలాల్లోని లంక గ్రామాలన్నీ మునకలో ఉన్నాయి. భద్రాచలం, ధవళేశ్వరం వద్ద గోదావరిలో నీరు తగ్గుతున్న నేపథ్యంలో మంగళవారం లంక గ్రామాల్లోని కొన్ని ప్రాంతాల్లో వరద నీరు తగ్గొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వారం రోజులుగా వరద నీరు నిలిచిపోవడంతో కనకాయలంక గ్రామంలో శరీరంపై దద్దుర్లు వస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. బాడవ, లక్ష్మీపాలెం, కనకాయలంక, పెదలంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లోని రోడ్లన్నీ జలమయమవ్వగా, ఇళ్ల చుట్టు వరద నీరు చేరింది. కనకాయలంక, పెదలంక గ్రామాల్లో సోమవారం పశు సంవర్ధక శాఖ అధికారులు పశువుల దాణా పంపిణీ చేశారు.

ముంపులో వరి పొలాలు

మొగల్తూరు: ఇటీవల కురిసిన వర్షాలకు మునిగిన చేలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఈ నెల 8 నుంచి 23 వరకు పలు దఫాలుగా సుమారు 112.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో మొగల్తూరులోని పాలకమ్మచెరువు, నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, కేపీపాలెం, పేరుపాలెం, రామన్నపాలెంలోని అడవిపర్ర, సుబ్బారాయుడు గుడి ప్రాంతాలలోని చేలు ముంపునకు గురయ్యాయి. వర్షాలతో పాటు కాలువలు వదిలినా కాలువలో నిలిచిపోయిన గుర్రపుడెక్క, చెత్త, చెదారాల కారణంగా పూర్తి స్థాయిలో నీరందలేదు. దీంతో సార్వా సాగు పనులు జూలై ముగుస్తున్నా వ్యవసాయ పనులు పూర్తి కాలేదు. ముందుగా వేసిన నాట్లు, వెనకాల వేసిన ఆకుమడులు పూర్తిగా నీటమునిగాయి. మొగల్తూరు మండలంలో 1628 ఎకరాల్లో సార్వా సాగు చేపడతారని అధికారులు అంచానా వేయగా, 93 ఎకరాలలో నాట్లు వేయగా 40 ఎకరాలు ఇంకా ముంపులోనే ఉన్నాయని, అలాగే 31 ఎకరాల్లో ఆకుమడులు వేయగా 25 ఎకరాల నారుమడులు మునిగాయని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. సోమవారం రామన్నపాలెం పంచాయతీ అడవిపర్రలోని ఓ రైతు ఒక పక్క చేలోని నీటిని ఇంజన్‌లు వేసి బయటకు తోడుతుండగా, మరోవైపు నీటిని బయటకు తోడిన ప్రాంతంలో నాట్లు వేయడం కనిపించింది. సార్వాసాగు ఆలస్యం కావడంతో వెదజల్లే పద్ధతి పాటించాలని ఏవో అబ్దుల్ రహీమ్ సూచిస్తున్నారు. ఇప్పటికే మొగల్తూరు పంచాయతీలోని ఇంజేటివారిపాలెంలో 10 ఎకరాల్లో వెదజల్లే పద్ధతి పాటించారని ఆయన తెలిపారు. అలాగే ముంపు చేల్లో నీరు లాగిన అనంతరం 15 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌లను వినియోగించాలని సూచించారు. అలాగే ఆకుమడుల్లో నీటిని బయటకు తోడిన అనంతరం 2 గ్రాముల కార్బోడిజమ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులకు తగు సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముంపులోనే లంక గ్రామాలు

పెనుగొండ: గోదారమ్మ నెమ్మదిగా శాంతిస్తోంది. రెండు రోజులుగా ఉగ్రరూపం దాల్చి, సోమవారం మధ్యాహ్నం నుంచి నిలకడగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వస్తున్న వరదనీరు తగ్గుతుండడంతో పెనుగొండ, ఆచంట మండలాల్లో నిలకడగా ప్రవహిస్తోంది. అయితే, ఆచంట మండలంలోని లంక గ్రామాలు అయోధ్యలంక, పెదమల్లం లంక, కోడేరు లంకలకు చెందిన అణగార్లంగ, పుచ్చల్లంక, నేతల వారి పేట, పెదపేట, మర్రేమూల ప్రాంతాలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. రహదారులన్నీ జలమయం అయ్యాయి. పంటలు అన్నీ వారం రోజులుగా నీటిలోనే మునిగి ఉండడంతో పూర్తిగా దెబ్బతింటున్నాయి. లంక గ్రామాల ప్రజలు తాగునీటికి పలు అవస్థలు పడుతున్నారు. అయోధ్యలంకలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ కొందరికి అండగా నిలిచింది. సమీపంలోని వారు వరద నీటిలోనే వచ్చి త్రాగునీటిని తీసుకు వెళుతున్నారు. పెదమల్లంలోని ప్రసిద్ధ మాచేనమ్మ ఆలయం వరద ముంపులోనే ఉంది. ఆలయం మొత్తం వరద నీటితో నిండిపోవడంతో రాకపోకలు నిలిపేశారు. కలెక్టరు చదలవాడ నాగరాణి లంక గ్రామాలను పరిశీలించి వెళ్లిన అనంతరం, సోమవారం నుంచి ముంపు ప్రాంతాల్లోని 1659 కుటుంబాలకు వరద సహాయం అందిస్తున్నారు. బియ్యం, నూనె, బంగాళా దుంపలు, ఉల్లిపాయలు అందిస్తున్నారు. తహసీల్దారు ఐపీ శెట్టి, ఎంపీడీవో నరసింహ ప్రసాద్ వరద పరిస్థితులు పర్యవేక్షిస్తున్నారు.

పెనుగొండ మండలంలో

సిద్ధాంతం మధ్యస్థ లంకలో లంక భూములు వరద నీటిలోనే మునిగి ఉన్నాయి. కేదారీ ఘాట్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం ఇంకా వరద ముంపులోనే ఉంది. కొద్దిగా వరద ఉధృతి తగ్గడంతో రెండు అడుగుల మేర నీటి మట్టం తగ్గింది. సందర్శకులు ఎవరూ గోదావరి వద్దకు రావద్దంటూ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.


పెదమల్లంలో గోదావరి ఉధృతి


ముంపు నీటిని తోడిన అనంతరం నాట్లు వేస్తున్న కూలీలు


వరి పొలాల్లో నీటిని బయటకు తోడుతున్న దృశ్యం


బాడవలో వరదముంపులో ఉన్న ఇటుక బట్టీలు


అయోధ్యలంకలో వరద నీటిలో కూకూ వాహనం

క్లుప్తంగా

సీపీఎం నాయకుల నిరసన



నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఎం నాయకులు

పాలకొల్లు అర్బన్: స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకై పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు రక్షణ కల్పించాలని సీపీఎం నాయకులు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌లో పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా నిరసన ప్రదర్శన చేశారు. ఇజ్రాయిల్ దేశం పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించి యుద్ధం చేస్తోందన్నారు. నిరసన ప్రదర్శనలో సీపీఎం నాయకులు జవ్వాది శ్రీనివాసరావు, చల్లా సోమేశ్వరరావు, తిరుమాని శ్రీనివాస్, వేగి రత్తయ్య, జి.వెంకటేశ్వరరావు, కె.రాజారావు, కృష్ణ, మల్లుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శిక్ష సప్తాహ్ ముగింపు కార్యక్రమం


విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎంఈవో శర్మ

పాలకొల్లు సెంట్రల్: కేంద్ర ప్రభుత్వం, ఏపీ సర్వశిక్షా అభియాన్ ఆదేశాల ప్రకారం నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శిక్ష సప్తాహ్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు శుభ తిథి భోజనాలు ఏర్పాటు చేశామని మండల విద్యాశాఖాధికారి-2 ఆర్ ఎస్వీజీఎస్ శర్మ అన్నారు. సోమవారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు సంగినీడి రంగారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్, ఉపాధ్యాయులు బొక్కా భవానీ దుర్గ, శశికళ, త్రిమూర్తులు, కరణం పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోండి


పశువుల దాణాను అందజేస్తున్న ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం రూరల్: ప్రభుత్వం అందించే సౌకర్యాలను వినియోగించుకొని పాడి రైతులు పాల దిగుబడిని పెంచుకోవాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. సోమవారం నరసాపురం మండలం సరిపల్లిలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల పట్ల రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా పశు వైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్, కొప్పర్రు పశువైద్యాధికారి ఇంజేటి సురేంద్ర పశువులకు గర్భకోశ వ్యాధులకు, లేగ దూడలకు నట్టల నివారణ, గోమార్లకు చికిత్స, గొంతువాపు, ముద్ద చర్మ వ్యాధి నివారణకు టీకాలు, కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు వేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ దొండపాటి స్వాములు, సర్పంచ్ ఈదా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత పశు వైద్య శిబిరం

పోడూరు: పండితవిల్లూరులో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పశు వైద్యాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, చూడి పరీక్షలు, ఎదకురాని పశువులకు చికిత్స, కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ముంపు ప్రాంతాల పరిశీలన


బాధితులను పరామర్శిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పోడూరు: ముంపునకు గురైన వద్దిపర్రు గ్రామాన్ని సోమవారం రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సందర్శించారు. వరద బాధితులను పరామర్శించి బాధితులకు రూ.3వేల నగదు, 25కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు భద్రాచలం, ధవళేశ్వరం వద్ద వరద ఉధృతిని ఎప్పటికప్పుడు తెలుసుకొని సహాయక చర్యలపై కలెక్టర్లకు, ఎస్పీలకు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నారన్నారు. మంత్రి వెంట ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, వడ్లపాటి రాజేంద్రప్రసాద్, డ్రెయిన్స్ ఇన్‌ఛార్జి ఈఈ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రత్యేకాధికారి కె.గంగాధర్, తహసీల్దార్ బీవీ మురళీకృష్ణ, ఎంపీడీవో డి.సుహాసిని, పెన్మెత్స రామభద్రరాజు ఉన్నారు.

ముగిసిన సంగీతోత్సవాలు


సంగీతోత్సవాల్లో పాల్గొన్న కళాకారులు, మానవత సభ్యులు

పెనుగొండ: త్యాగరాజ గానసభ 40వ సంగీతోత్సవాలు ముగిశాయి. సోమవారం ముగింపు ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన జొన్నలగడ్డ శ్రీరామ్ గాత్ర సంగీత విభావరి అలరించింది. ఈ సందర్భంగా పలువురు సంగీత కళాకారులను, పోత్రాహకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీవాసు, కె.యోగేష్, సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కలిదిండి అన్నపూర్ణ, సంగీత అధ్యాపకురాలు గుత్తిన అన్నపూర్ణ, వల్లూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి

నరసాపురం: వశిష్ట గోదావరి ఉధృతి పెరుగుతుంది. గత నాలుగు రోజులుగా పరిస్థితిని పరిశీలిస్తే మధ్యలో ఒకరోజు నీటి ప్రవాహవేగం తగ్గింది. నీటి మట్టం కూడా తగ్గింది. క్రమంగా నీటిమట్టం పెరుగుతుంది. సముద్ర సంగమ ప్రాంతం కావడంతో ఎగువ ప్రాంతం నుంచి నీరు వచ్చి చేరే కొలదీ ఇక్కడ నీటి మట్టం పెరుగుతుంది. భద్రాచలంలో నీటి మట్టం తగ్గే కొద్దీ ఇక్కడ నీటిమట్టం పెరుగుతుంది. దీంతో వరద ముప్పు స్థానికంగా భయపెడుతుంది. ప్రతీ ఏటా వరదల సమయంలో గోదావరి పరీవాహక ప్రాంతాలు నీట మునిగిపోతాయి. ముఖ్యంగా నరసాపురం మండలం నవరసపురం గ్రామానికి ముంపుగండం పొంచి ఉంది. స్థానికంగా గోదావరి నీటిమట్టం కొద్దిగా పెరిగినా కూడా, గ్రామం వరద తాకిడికి గురవుతుంది. పట్టణంలో గోదావరిని ఆనుకుని ఉన్న పొన్నపల్లి, మాధవాయిపాలెం, కొండాలమ్మగుడి ప్రాంతం, నందమూరి కాలనీ వాసులు భయపడుతున్నారు. అటువైపు దర్బరేవు చుట్టు ప్రక్కల గ్రామాలకు కూడా వరద ముంపు భయంతో ఉన్నారు. మాధవాయిపాలెం రేవులో పంటు రాకపోకలు కొనసాగడం లేదు.


నరసాపురం వలంధర్ రేవు వద్ద గోదావరి ప్రవాహ ఉధృతి


బాపూ ఘాట్ నీట మునిగిన దృశ్యం

చేనేతకు చేయూతనివ్వండి

పెనుగొండ: ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రతీ ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించి చేనేతకు చేయూతనివ్వాలని జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లాడ సూర్య భాస్కరరావు ఓ ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం చేనేతలను ఆదుకోవడానికి నేతన్న నేస్తం ప్రవేశపెట్టిందని వివరించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గంలోనూ చేనేత బజార్లు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నరసాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటు చేసినట్టు చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. అజెండాలోని అంశాలతో పాటు వార్డుల్లో నెలకొన్న సమస్యలు చర్చిస్తామన్నారు. సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

బాధితులను ఆదుకుంటాం

పెనుగొండ: వరద ముంపు బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆచంట మండలంలోని వరద ముంపు ప్రాంతాలైన అయోధ్యలంక, పెదమల్లం లంక, కోడేరు లంక, భీమలాపురం లంక గ్రామాలను పరిశీలించారు. పాడైపోయిన పంటలకు నష్ట పరిహారం ఇప్పించాలని ఎమ్మెల్యే పితానికి రైతులు విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ దిగమర్తి సూర్య కుమారి, జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు నష్టం


వద్దిలంక వద్ద నక్కల అవుట్ ఫాల్ స్లూయిజ్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

యలమంచిలి: అధికారుల నిర్లక్ష్యం కారణంగా యలమంచిలి, పోడూరు, ఆచంట మండలాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. నక్కల అవుట్ ఫాల్ స్లూయిజ్ తలుపులు సక్రమంగా పని చేయడం లేదని, వాటిని బాగు చేయించాలని వేసవిలో కలెక్టర్, డ్రెయిన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం స్లూయిజ్ కింద తలుపు ఊడిపోవడం వలన పై మూడు మండలాల్లోని సుమారు 10 గ్రామాలలో వేలాది ఎకరాల ఆక్వా చెరువులు, వరి పొలాలు ముంపునకు గురయ్యాయన్నారు. తక్షణమే అధికారులు ఊడిపోయిన తలుపు వద్ద ఇనుప రేకులు అడ్డుపెట్టి వరద ముంపు నుంచి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. దెబ్బతిన్న ఆక్వా, వరి రైతులకు ఎకరాకు రూ.30 వేలు నష్ట పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కట్టుపాలెం సర్పంచ్ పొన్నమండ నాగరాజు రైతులు జడ్డు బదరీ నారాయణ, పల్లి జార్జిబాబు, యేడిద శ్రీనివాస్, చెల్లుబోయిన నాగ ఆంజనేయులు, వై కేశవరావు, రుద్రరాజు విశ్వనాథరాజు తదితరులు ఉన్నారు.

ముంపు అంచనాలు నివేదిస్తాం


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

నరసాపురం రూరల్: అధిక వర్షాలు, వరదల కారణంగా మండలంలో ముంపు బారిన పడిన పంట పొలాలలను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అనిల్‌కుమారి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి మురుగునీటి కాలువలు, ముంపు చేలను పరిశీలించి పలు చోట్ల రైతులతో మాట్లాడారు. అధిక వర్షాలు, గోదావరికి వరద పోటు ఎక్కువగా ఉండటంతో నీరు లాగక వరి పొలాలు ముంపు బారిన పడ్డాయని ఏడీఏ అన్నారు. మండలంలోని గొంది, చిట్టవరం, లిఖితపూడి, మల్లవరం, తదితర గ్రామాల్లోని రైతులతో ఆయన మాట్లాడారు. వ్యవసాయశాఖ సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాల్లో ముంపు వివరాలను సేకరించారు. మల్లవరంలో మొగల్తూరు డ్రెయిన్, లిఖితపూడిలో నత్తలావా డ్రెయిన్ నీటిని లాగక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆమె దృష్టికి తీసుకు వచ్చారు. గోదావరి ఉధృతి వలన చిట్టవరం, గొంది నవరసపురం ప్రాంతాల్లో వరద నీటితో పొలాలు ముంపు బారిన పడ్డాయని రైతులు పేర్కొన్నారన్నారు. నారుమడులు దెబ్బతిన్న రైతులు మరలా నారుమడులు వేసుకునేందుకు అవసరమైన విత్తనాల కోసం ఉన్నతాదికారులకు నివేదికలు పంపామని ఏడీఏ వివరించారు. ఈమె వెంట ఏఈవో ఇబ్బా లక్ష్మీనారాయణ, వీపీఏ మహాలక్ష్మి, వీహెచ్ఏ జీవన్, పలువురు రైతులు ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలి


తహసీల్దార్ బీవీ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పోడూరు: అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ మండలశాఖ ప్రధాన కార్యదర్శి కె.నాగరాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు యూటీఎఫ్ మండలశాఖ నాయకులు సోమవారం స్థానిక తహసీల్దార్ బీవీ మురళీకృష్ణ, ఎంపీడీవో డి.సుహాసిని, ఎంఈవో జి.విజయకుమార్‌లకు వినతి పత్రాలు అందజేశారు. జీవో 117 రద్దు చేసి జీవో ఎంఎస్ నెం.55 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలని, ప్రీప్రైమరీతో పాటు 1 నుంచి 5 తరగతులను ఒకే పాఠశాలగా నడపాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్ష విధానం అమలు చేయాలని తదితర డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎంపీ రాజశేఖర్, మండలశాఖ గౌరవాధ్యక్షుడు బి.శేషగిరిరావు, సహాధ్యక్షుడు కె.పెద్దిరాజు, తదితరులు ఉన్నారు.

పరిశుభ్రత పాటించాలి


అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్

పాలకొల్లు అర్బన్: ఇంటి పరిసరాల్లో మురుగు గుంటలు లేకుండా పరిశుభ్రత పాటించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ అన్నారు. పాలకొల్లు మండలం చింతపర్రులో సోమవారం డెంగీ మాసోత్సవాల్లో భాగంగా అవగాహన, ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో జ్వరాల బారిన పడిన ప్రజల రక్త నమూనాలను సేకరించి లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహించారు. ఇంటింటా సర్వే చేసి, దోమ లార్వాలను గుర్తించి వాటివల్ల కలిగే అనర్థాలను స్థానికులకు వివరించారు. దోమలు, కలుషిత నీరు, ఈగలు వాలిన ఆహార పదార్థాలను భుజించడం వలన కలిగే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రాజ్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఏఎన్ఎం అనిత, హెల్త్ అసిస్టెంట్ తారకసత్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ


దాణా పంపిణీ చేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

యలమంచిలి: వరద ముంపునకు గురైన కనకాయలంక, పెదలంక గ్రామాల్లో సోమవారం పశు సంవర్ధకశాఖ అధికారులు పశువుల దాణా పంపిణీ చేశారు. రెండు గ్రామాల్లోను పశువుకు 25 కిలోలు, గొర్రె, మేకకు 5 కిలోలు చొప్పున, పాడి రైతులకు 20 టన్నుల మిశ్రమ దాణా ప్యాకెట్లను ఉచితంగా అందించారు. కనకాయలంకలో 450 పశువులకు, 30 గొర్రెలకు, పెదలంకలో 320 పశువులకుగాను 200 మంది రైతులకు 20 టన్నులు దాణా ఉచితంగా పంపిణీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ దాణా పంపిణీ చేశామని, వరద పూర్తిగా తగ్గే వరకు ఈ గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని పశు సంవర్ధక శాఖ భీమవరం డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ జవార్ హుస్సేన్ చెప్పారు. సర్పంచ్‌లు మద్దా శ్రీనివాసరావు, తాళ్ల నాగరాజు డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన సదస్సు


కొండావారిపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వం నిర్దేశించిన వయస్సు ప్రకారం యువతులకు వివాహాలు చేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్య సౌజన్య సూచించారు. పాలకొల్లు మండలం గోరింటాడలో సోమవారం మిషన్ శక్తి 100 అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సత్యసౌజన్య మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. గ్రామ సర్పంచ్ మండెల పావని, మండల నాని, పంచాయతీ కార్యదర్శి ఎం.సేవా కిషోర్, సూపర్ వైజర్ జీఎస్ మల్లేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ హారిక, మీరాంజనేయులు, సురేష్, ఇందిరామణి, లక్ష్మి, కిషోర బాలికలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మొగల్తూరు: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని వాటిపై కిశోర బాలికలు, వారి తల్లితండ్రులు అవగాహన కల్పించుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో ఊర్మిళ సూచించారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం మొగల్తూరు పంచాయతీ కొండావారిపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఊర్మిళ మాట్లాడుతూ పోక్సో చట్టం, పోసో చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పివిజయకుమారి, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉపాధ్యాయులు తదితరులు పల్గొన్నారు.

ప్రభుత్వ బడులను సద్వినియోగం చేసుకోవాలి

పెనుగొండ: విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వడలి సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు అన్నారు. సోమవారం వడలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా నిర్వహించిన శుభ తిథి భోజనాల కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. ఆయా గ్రామాల్లో విద్యార్థులకు రుచికరమైన భోజనాలు అందించడానికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో భాస్కరరావు, గణపతినీడి బుల్లియ్య, శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు బచ్చు నర్శింహమూర్తి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక


అవార్డులతో వనిత క్లబ్ సభ్యురాళ్లు

పాలకొల్లు సెంట్రల్: యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నూతన అధ్యక్షునిగా జక్కంపూడి మదన్, సెక్రటరీ వేరుకొండ దుర్గాప్రసాద్, ట్రెజరర్ శిరిగినీడి నాగార్జునలను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడం ఒక అదృష్టంగానే భావించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుణ్ణం నాగబాబు, ముచ్చర్ల సంజయ్, పెనుమాక రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.